SK1 NEWS HD

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

జాతీయ తెలుగు దినపత్రిక

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 141 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | సోమవారం 10-08-2026



## నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు.. విద్యార్థుల నిరసన!

- నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ సూర్యకాంత్‌ను పిలవొద్దని విద్యార్థుల డిమాండ్
- దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి యాజమాన్యానికి లేఖ అందజేశారు
- నీట్ నిరసనలపై సీజేఐ చేసిన వ్యాఖ్యలే అభ్యంతరాలకు కారణంగా వెల్లడి
- ఇటీవలే ముంబై టిస్‌లోనూ ఇదే తరహా నిరసనలతో స్నాతకోత్సవం వాయిదా

**హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ - మిగతా 2 లో

## రుద్రమదేవి నుంచి శ్రీకృష్ణదేవరాయల వరకు



- బోనాల పండుగకు వేల ఏళ్ల చరిత్ర!
- కాకతీయ రాణి రుద్రమదేవి బోనం సమర్పించినట్లు ఆధారాలు
- 1516లోనే బోనాలపై పన్ను రద్దు చేస్తూ శ్రీకృష్ణదేవరాయల శాసనం
- ప్లేగు వ్యాధి కంటే ముందే బోనాలు ఉన్నాయని రుజువు చేస్తున్న పరిశోధనలు
- కుతుబ్ షాహీల కాలం నుంచీ గోల్కొండలో నిరంతరాయంగా ఉత్సవాలు

**హైదరాబాద్ :**

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ చరిత్ర నిన్నమొన్నటిది కాదని, దానికి వేల ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం ఉందని చారిత్రక ఆధారాలు వెల్లడిస్తున్నాయి. 1816లో హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి - మిగతా 2 లో

## హైదరాబాద్‌లో 40 లక్షల

# ఓట్లు గల్లంతు?

- ఓటర్ల జాబితా సర్వేతో భారీ మార్పులు!
- హైదరాబాద్‌లో భారీగా తగ్గనున్న ఓటర్ల సంఖ్య
- సుమారు 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగింపు అంచనా
- సొంతూరిలో ఓటు హక్కుకే వలసదారుల మొగ్గు
- సనత్‌నగర్‌లో అత్యధికంగా 45శాతం ఓట్ల రద్దుకు అవకాశం
- ఆగస్టు 17న విడుదల కానున్న ముసాయిదా ఓటర్ల జాబితా




**హైదరాబాద్ :**

రాజధాని హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యలో భారీ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే కారణంగా గ్రేటర్ పరిధిలో ఏకంగా 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రేపటితో ఈ సర్వే కార్యక్రమం ముగియనుండగా, నిన్నటి వరకు ఉన్న సమాచారం ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల పరిధిలో ఉన్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు మూడో వంతు ఓట్లు రద్దయ్యే సూచనలు కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఆది, సోమవారాల్లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లోనే ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించని ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి, ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.ఓట్ల తొలగింపు ప్రభావం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ, - మిగతా 2 లో

## జాతీయ జెండాతో పాటు

# మీ అజెండా ఉండాలి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం
- విజయవాడలో కార్యక్రమం... హాజరైన సీఎం చంద్రబాబు
- ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సీఎం పిలుపు
- జీవో నెంబర్ 3ను చట్టపరంగా కాపాడతామని ఆదివాసులకు భరోసా
- అరకు కాఫీ తరహాలో స్థానిక గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్
- ద్రౌపది ముర్ము స్ఫూర్తితో ఎదిగి దేశ నిర్మాణంలో భాగస్వాములు ం కావాలని యువతకు ఉద్బోధ



**అమరావతి :**

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. దేశభక్తి అంటే కేవలం సరిహద్దుల్లో పోరాడటం మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వృత్తిలో విజయం సాధించి, సమాజానికి సేవ చేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్బోధించారు. ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభకు చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... గిరిజన సమాజానికి సమగ్ర అభివృద్ధి, సంక్షేమంపై పలు కీలక హామీలు ఇస్తూ, వారి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.సాధారణ ఆదివాసీ కుటుంబంలో పుట్టి, అనేక కష్టాలను అధిగమించి, దేశ ప్రథమ పౌరురాలిగా అత్యున్నత శిఖరాలను అధిరోహించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చంద్రబాబు అన్నారు. ఆమె స్ఫూర్తితో గిరిజన యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. జాతీయ జెండాతో పాటు మీ అజెండా - మిగతా 2 లో



## ఐక్యతే మన బలం

## క్విట్ ఇండియా స్ఫూర్తిపై పవన్ ట్వీట్

- క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్మరించుకున్న పవన్ కల్యాణ్
- స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు
- సిసలైన భారతావని నిర్మాణమే వారికిచ్చే గౌరవమన్న పవన్
- ఐక్యత, సమష్టి సంకల్పమే దేశ నిజమైన బలమని వ్యాఖ్య

**అమరావతి :**

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ, ఆ మహోద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళు లర్పించారు. శనివారం ఆయన 'ఎక్స్' వేదికగా ఈ మేరకు తన సందేశాన్ని పంచుకున్నారు. దేశ - మిగతా 2 లో



## తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ

- ఆక్టోపస్ బిల్డింగ్ వరకు క్యూలైన్లు
- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల భారీ రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు నిండి బయటకు చేరిన క్యూలైన్లు
- గోగర్భం డ్యామ్ సర్కిల్ వద్ద ఆక్టోపస్ భవనం వరకు బారులు
- సర్వదర్శనానికి 20 నుంచి 24 గంటల నిరీక్షణ

**అమరావతి :**

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు బయటకు విస్తరించాయి. - మిగతా 2 లో

## ఏదో ఒకరోజు అమిత్ షా సమాధానం చెప్పక తప్పదు



- రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవటాన్ని తప్పుపట్టిన రాహుల్
- విద్యార్థుల ప్రతిధ్వని కార్యక్రమంలో ఓ విద్యార్థి ఆవేదనను పంచుకున్న కాంగ్రెస్ అగ్రనేత

**ఢిల్లీ :**

నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసుల దాడి ఘటనకు సంబంధించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవటాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. అమిత్ షా ఏదో ఒకరోజు సమాధానం చెప్పక తప్పదన్నారు. ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పటానికి బదులు వారినే క్షమిస్తున్నానని ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' (విద్యార్థుల ప్రతిధ్వని) కార్యక్రమంలో ఓ విద్యార్థి తనతో పంచుకున్న ఆవేదనను రాహుల్ 'ఎక్స్' ద్వారా ఆదివారం పంచుకున్నారు.ఉన్న భూమి అమ్మి, అదీ చాలక అప్పులు చేసి మరీ పరీక్షకు సిద్ధమైతే చివరికి దక్కిందేమీ లేదని బాధిత విద్యార్థి వాపోయినట్లు రాహుల్ చెప్పారు. - మిగతా 2 లో

## ట్రంప్ కొత్త హెయిర్‌స్టైల్‌పై రచ్చ.. సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువ!



- లాస్ వెగాస్‌లో కొత్త హెయిర్‌స్టైల్‌తో కనిపించిన డొనాల్డ్ ట్రంప్
- ఆయన జుట్టుపై సోషల్ మీడియాలో మీమ్స్, జోకులు వైరల్
- ట్రంప్ లుక్‌పై ఆయన సోదరుడి కుమార్తె మేరీ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- చిత్తవైకల్యంతో బాధపడిన తన తండ్రిని ట్రంప్ గుర్తుచేశారని వ్యాఖ్య
- ట్రంప్ జుట్టుపై ఏఐ జనరేటెడ్ వీడియో కూడా ఆన్‌లైన్‌లో హల్‌చల్

**ఢిల్లీ :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన హెయిర్‌స్టైల్‌తో వార్తల్లో నిలిచారు. ఇటీవల లాస్ వెగాస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన సరికొత్త లుక్‌తో కనిపించారు. గతంలో కంటే భిన్నంగా, మరింత ఒత్తుగా, బంగారు రంగులో మెరిసిపోతున్న ఆయన జుట్టు అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆయన తన - మిగతా 2 లో




## బ్రహ్మోస్‌కు ప్రపంచవ్యాప్తంగా

# పెరిగిన గిరాకీ

- కొనుగోలుకు క్యూ కడుతున్న దేశాలు!
- ఆపరేషన్ సిందూర్‌తో బ్రహ్మోస్‌కు అంతర్జాతీయంగా భారీ డిమాండ్
- పాక్ వద్ద ఉన్న చైనా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను విజయవంతంగా ఛేదించిన క్షిపణి
- వియత్నాం, ఇండోనేషియాతో వందల మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు ఖరారు
- పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా దేశంలోని నాలుగు కేంద్రాల్లో ఉత్పత్తి వేగవంతం

**ఢిల్లీ :**

భారత అమ్ములపొదిలోని బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణికి అంతర్జాతీయంగా గిరాకీ అమాంతం పెరిగింది. ముఖ్యంగా, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఈ క్షిపణి చూపిన అద్భుతమైన పనితీరు, దాని కచ్చితత్వం, విధ్వంసక శక్తి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించాయి. ఈ ఆపరేషన్ తర్వాత బ్రహ్మోస్ కొనుగోలుకు పలు దేశాలు తీవ్ర ఆసక్తి చూపుతుండగా, ఇప్పటికే - మిగతా 2 లో

# సంపాదకీయం

## సముచిత తీర్పు



రోజూ ఐదువందలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరిగే ఈ దేశంలో, యాభైఆరుశాతం వాహనాలు ఇన్సూరెన్స్ లేకుండా రోడ్లమీద యథేచ్ఛగా తిరుగుతున్నాయి. ఇవన్నీ సక్రమంగా రిజిస్టరై, రికార్డుల్లో ఫిట్‌గా ఉన్నవే. ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలవారికి ఒక్కరూపాయి కూడా దక్కకుండా చేస్తున్న ఈ స్థితిని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించి, కొన్ని సూచనలు చేయడం బాగుంది. వాహనదారులు మోటారువాహనాల చట్టంలోని అత్యంత కీలకమైన నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తుంటే, వాటిని కచ్చితంగా అమలు చేయించడంలో అధికారులు విఫలమవుతున్న తరుణంలో, పెట్రోల్ బంకుల దగ్గరే ఈ స్థితిని సరిదిద్దాలన్నది సుప్రీంకోర్టు ఆలోచన. ఇన్సూరెన్స్ లేని వాహనాలకు పెట్రోల్ బంకుల దగ్గర చమురు నిరాకరించే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలుచేయమని కేంద్రానికి కోర్టు చేసిన సూచన బాగుంది. ఇన్సూరెన్స్ సమస్యను తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు, ప్రమాదాల నివారణ మీద అధికదృష్టి పెట్టి, ప్రభుత్వాలను నిలదీసివుంటే మరింత బాగుండేదన్నది వేరే సంగతి. కానీ, మొత్తం రోడ్డుప్రమాదాల్లో దాదాపు నాలుగోవంతు ఇన్సూరెన్స్ లేని వాహనాలవల్లనే జరుగుతున్నాయి. బీమా ఉల్లంఘన మోటార్ వాహనాల చట్టంలోని అతికీలకమైన 146వ నిబంధన అసలు లక్ష్యాన్ని దెబ్బతీస్తున్నది. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ లేని వాహనాన్ని నడుపుతున్నవారికి పెనాల్టీలతో పాటు, జైలుశిక్ష కూడా విధించాలని చట్టం చెబుతూంటే, దానిని ఉల్లంఘించి వాహనాన్ని నడిపి యాక్సిడెంట్లు చేయడం ద్వారా వాహనదారులు ఎదుటివారికి తీవ్ర అన్యాయం చేస్తున్నారు. వాహన ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలవారికి సత్వరమే పెద్దమొత్తంలో దక్కాల్సిన నష్ట పరిహారాన్ని దూరం చేస్తున్నారు. ఏళ్ళతరబడి న్యాయపోరాటాలు చేసినా ఫలితం దక్కని స్థితి బాధితులకు ఏర్పడుతోంది. బంకుల్లో పెట్రోల్ పోయడం మానేస్తే, ఇన్సూరెన్స్‌లేని వాహనాలను సులువుగా గుర్తించడమే కాక, వాహన యజమానికి కూడా తాను చెల్లుబాటయ్యే బీమా లేకుండానే వాహనాన్ని నడుపుతున్న విషయం తెలియచెప్పడం అవుతుందని కోర్టు అంటోంది. ఇలా గుర్తుచేయడం బాగున్నది కానీ, తాను ఇన్సూరెన్స్ లేని వాహనం నడుపుతున్నానని అత్యధికశాతం యజమానులకు తెలియదనుకోలేం. కోర్టు సూచనలు కచ్చితంగా అమలై, బంకుల్లో పెట్రోల్ పోయడం ఆగిన పక్షంలో తప్పనిసరిగా ఇన్సూరెన్స్ రెన్యువల్ చేసేవారి సంఖ్య హెచ్చుగా ఉంటుందన్నది వాస్తవం. ఇరవైయేళ్ళనాటి కేసుకు సంబంధించిన తీర్పులో సుప్రీంకోర్టు వెలిబుచ్చిన అభిప్రాయాలు, ఆదేశాలు సముచితమైనవి. 1996లో ప్రకాశంజిల్లా సింగరాయకొండ దగ్గర జరిగిన రోడ్డుప్రమాదంలో మరణించిన ఒక వ్యక్తి కుటుంబసభ్యులకు పరిహారం చెల్లించే విషయంలో జరిగిన అన్యాయాన్ని ఈ తీర్పు ప్రశ్నించింది. కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోయినందుకు బీమా కంపెనీనుంచి పదిలక్షల రూపాయల నష్టపరిహారాన్ని అతని కుటుంబసభ్యులు కోరితే, వాహనానికి బీమా ఉన్నా, వాహన యజమాని వ్యక్తిగత రిస్క్‌ను కవర్ చేసే అదనపు బీమా ప్రీమియం కట్టనందుకు ఈ పరిహారం కోరే అర్హత ఆ కుటుంబానికి లేదని ట్రైబ్యునల్ తేల్చేసింది. మూడేళ్ళ తరువాత హైకోర్టు బాధిత కుటుంబం పక్షాన తీర్పు వెలువరించి, నెలవారీ ఆదాయం ప్రాతిపదికన ఓ పదిలక్షలరూపాయలు పరిహారంగా చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశించడంతో ఆ సంస్థ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఈ కేసులో హైకోర్టు తీర్పును సమర్థిస్తూ, వాహనంలో కూర్చున్న ప్రతీ వ్యక్తికీ బీమా కంపెనీలు కాంప్రహెన్సివ్ పాలసీ కింద పరిహారం చెల్లించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టంచేయడం సముచితం. వాహన బీమాకు సంబంధించి ధర్మాసనం జారీ చేసిన సూచనలను, మార్గదర్శకాలను అమలులోకి తీసుకురావడం ప్రభుత్వం విధి. ఇంటికి ఆధారమైన వ్యక్తి వాహన ప్రమాదంలో మరణిస్తే, ఆ కుటుంబం పడే వేదన, కష్టాలు ఊహకు అందనివి. వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతూ, వాహనదారుల మత్తువల్లనో, అలసటవల్లనో అధిక ప్రమాదాలు జరుగుతున్న రోజులివి. లైసెన్సులు లేని డ్రైవర్లను, ఇన్సూరెన్స్ లేని వాహనాలను నియంత్రించడం, ప్రమాదాలను నివారించడం ప్రభుత్వాల కర్తవ్యం.

## ఐక్యతే మన బలం క్విట్ ఇండియా స్ఫూర్తిపై పవన్ ట్వీట్

**మొదటిపేజీ తరువాయి -** చరిత్ర గతిని మార్చి, భారతీయ ఆత్మను మేల్కొల్పిన మహోన్నత ఘట్టం క్విట్ ఇండియా ఉద్యమమని ఆయన కొనియాడారు."1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ ఇచ్చిన 'డూ ఆర్ డై' (సాధించు లేదా మరణించు) పిలుపు కోట్లాది మంది భారతీయుల్లో అచంచలమైన దేశభక్తిని, ధైర్యసాహసాలను నింపింది. ఈ నినాదం స్వాతంత్ర్య పోరాటాన్ని ఉవ్వెత్తున ఎగసిన జాతీయోద్యమంగా మార్చింది" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మాతృభూమి విముక్తి కోసం ప్రాణత్యాగాలు చేసిన ఆ మహనీయులకు తాను శిరస్సు వంచి ప్రణమిల్లుతున్నట్లు తెలిపారు. భారతదేశ వాస్తవిక శక్తి ప్రజల ఐక్యతలో, సవాళ్లను అధిగమించాలనే సమష్టి సంకల్పంలోనే ఉందని ఈ ఉద్యమం మనకు గుర్తుచేస్తోందన్నారు. పటిష్టమైన, స్వయం సమృద్ధ, అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించడం ద్వారానే ఆ వీరుల కలలకు, వారి త్యాగాలకు సరైన న్యాయం చేకూరుతుందని పవన్ కల్యాణ్ తన పోస్టులో వివరించారు.

## తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ

**మొదటిపేజీ తరువాయి -** గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు భక్తులు కిలోమీటర్ల మేర బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని అధికారులు వెల్లడించారు. నిన్న (ఆగస్టు 8) మొత్తం 87,658 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 40,606 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.13 కోట్లుగా నమోదైంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు 4.15 లక్షల లడ్డూలను విక్రయించగా, 3.09 లక్షల మందికి అన్నప్రసాదం అందించారు. వారాంతం కావడంతో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగినట్లు తెలుస్తోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పిస్తూ రద్దీని క్రమబద్ధీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. భారీ రద్దీ నేపథ్యంలో, తిరుమలకు వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని టీటీడీ సూచిస్తోంది.

## హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు గల్లంతు?



**మొదటిపేజీ తరువాయి -** కొన్ని ప్రాంతాల్లో ఇది అత్యధికంగా ఉంది. ముఖ్యంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,54,030 ఓట్లు ఉండగా, వాటిలో ఏకంగా 1.16 లక్షల ఓట్లు (45.68%) రద్దయ్యే అవకాశం ఉందని అంచనా. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో 44.21%, ఎల్బీనగర్‌లో 42.19%, ఉప్పల్‌లో 40.05%, మహేశ్వరంలో 40.03% ఓట్లు జాబితా నుంచి తొలగిపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో 21.43% ఓట్లు రద్దయ్యే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో ఈ సంఖ్యల్లో స్వల్ప మార్పులు మాత్రమే ఉండొచ్చని భావిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి, ఇతర అవసరాల కోసం ప్రతిరోజూ వేలాది మంది హైదరాబాద్‌కు వలస వస్తుంటారు. ఇక్కడే స్థిరపడి ఓటరుగా నమోదు చేసుకుంటారు. అయితే, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు సర్వే జరుగుతున్న నేపథ్యంలో.. సొంత ఊరితో పాటు హైదరాబాద్‌లోనూ ఓటు హక్కు ఉన్నవారు తమ ఓటును సొంతూరిలోనే కొనసాగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగరంలో ఎన్యుమరేషన్ ఫారాలను చాలామంది అధికారులకు తిరిగి ఇవ్వలేదని తెలుస్తోంది. ఇదే ఓట్ల సంఖ్య భారీగా తగ్గడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరోవైపు కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని లక్షలాది మంది ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారంతా ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సోమవారం గడువు ముగిసిన తర్వాత తుది లెక్కలు తేలనుండగా, ఆగస్టు 17న వెలువడనున్న ముసాయిదా జాబితాపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# జాతీయ జెండాతో పాటు మీ అజెండా ఉండాలి

**మొదటిపేజీ తరువాయి -** కూడా ఉండాలని పిలుపునిచ్చారు."సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు. ద్రౌపది ముర్ము, అబ్దుల్ కలాం, బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, నరేంద్ర మోదీ వంటి మహనీయులంతా సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. 'నేను ఏంటి? ఎలా ఎదగాలి? ఈ సమాజానికి, దేశానికి నేనేం ఇవ్వాలి?' అనే లక్ష్యంతో పనిచేయాలి. మీ విజయం దేశ విజయమవుతుంది.." అని ఆయన పేర్కొన్నారు. ఈ స్ఫూర్తిని వ్యాపింపజేసేందుకు ఆగస్టు 9 నుంచి 15 వరకు 'అనే నేను' పేరుతో ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గిరిజన ప్రాంతాల్లోని ఆర్థిక స్వావలంబనపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తాను 25 ఏళ్ల క్రితం ఒక చిరు ప్రయత్నంగా ప్రారంభించిన అరకు కాఫీ, నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచడాన్ని ఆయన గుర్తుచేశారు. "అరకు కాఫీకి నేనే పేరు పెట్టాను. దానిని మార్కెటింగ్ చేసి, ప్రధాని నరేంద్ర మోదీ నుంచి ఆస్ట్రేలియా ప్రధాని వరకు బహుకరించి, గ్లోబల్ బ్రాండ్‌గా నిలబెట్టాను. ఇవాళ పారిస్‌లో కూడా అరకు కాఫీ స్టాళ్లు ఉన్నాయి" అని గర్వంగా ప్రకటించారు. ఇదే స్ఫూర్తితో సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనాపిల్, తేనె, తాటిబెల్లం వంటి స్థానిక ఉత్పత్తులకు విలువ జోడించి, బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులు పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ సంస్థలతో 19 అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి నాలుగు కీలక రంగాలపై దృష్టి పెడుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, ఆదాయ మార్గాల పెంపునకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మౌలిక వసతులు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో 2,336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్‌లో రోడ్ కనెక్టివిటీ కల్పిస్తామన్నారు. 'జల్ జీవన్ మిషన్' కింద 2027 డిసెంబర్ నాటికి ప్రతి గిరిజన ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. మారుమూల గ్రామాలకు సైతం టెలికాం కనెక్టివిటీ అందించి, డోలీ మోతలు లేని సమాజాన్ని నిర్మిస్తామన్నారు. విద్య: 'తల్లికి వందనం' కింద 4.92 లక్షల మంది గిరిజన విద్యార్థులకు రూ.650 కోట్లు అందించామని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. విశాఖలోని మేకవారిపాలెంలో 600 మంది విద్యార్థులతో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేసి, ఐఐటీ వంటి జాతీయ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఏటా కనీసం 100 మంది గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి సంస్థల్లో సీట్లు సాధించడమే లక్ష్యమన్నారు. వైద్యం: పాడేరులో మెడికల్ కాలేజీతో పాటు పార్వతీపురం, రంపచోడవరం, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తామన్నారు. 'సంజీవిని' ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేస్తామని, సికిల్ సెల్ అనీమియా బాధితులకు రూ.10,000 పింఛను అందిస్తూ, వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రకటించారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు స్థానికులకే దక్కాలనే ఆశయంతో ఎన్టీఆర్ హయాంలో పురుడుపోసుకుని, తాను 2000 సంవత్సరంలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 3ను కాపాడతామని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. సుప్రీంకోర్టులో ఈ జీవోను కొట్టివేయడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని విమర్శించారు. "ఈ జీవోను చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా నిలబడేలా పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తాం. ఆదివాసుల హక్కుల పరిరక్షణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆవేశంతో కాకుండా ఆలోచనతో, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని దీనిపై ముందుకు వెళతాం" అని భరోసా ఇచ్చారు. గిరిజన ప్రాంతాలను కేవలం వెనుకబడిన ప్రాంతాలుగా కాకుండా, అపార అవకాశాలున్న ప్రాంతాలుగా చూస్తున్నామని, అక్కడి పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణాన్ని ఉపయోగించుకుని టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రతి గిరిజన ఇల్లు 'అతిథి గృహం'గా మారాలని, తద్వారా ప్రపంచానికి ఆతిథ్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్రప్రదేశ్' లక్ష్యాలను సాధించడంలో ఆదివాసీలు కీలక పాత్ర పోషించాలని, వారి సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# ఏదో ఒకరోజు అమిత్ షా సమాధానం చెప్పక తప్పదు

**మొదటిపేజీ తరువాయి -**
ఇప్పుడు తనకు ఏదారీ కనిపించటం లేదని అతడు తనతో చెప్పినట్లు తెలిపారు. ఇది ఆ విద్యార్థి వైఫల్యం కాదని, అతని కష్టానికి తగిన ప్రతిఫలం ఇవ్వలేని ప్రస్తుత వ్యవస్థ వైఫల్యమని ఆయన విమర్శించారు. యువతే దేశానికి వెలుగు అని, వారికి తమ పార్టీ పూర్తి అండగా ఉంటుందని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సంస్థ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశపు గొప్ప బలం యువతేనని ఆయన పేర్కొన్నారు. అలాగే, యువ భారతీయులకు తమ గళాలను, ఆందోళనలను వినిపించడానికి, తమ హక్కులు, కలలు, ఆకాంక్షల కోసం పోరాడటానికి ఒక వేదికను అందించడంలో ఐవైసికి ఉన్న ప్రాముఖ్యాన్ని ఎక్స్‌లో ప్రస్తావించారు. "ఐవైసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇండియన్ యూత్ కాంగ్రెస్ సభ్యులందరికీ శుభాకాంక్షలు. భారతదేశపు అతిపెద్ద బలం దాని యువతే. యువ భారతీయులకు ఒక వేదికను అందించడంలో ఐవైసికి అద్భుతమైన చరిత్ర ఉంది. యువత తమ గొంతుకను వినిపించడంలో, వారి సమస్యలను లేవనెత్తడంలో, వారికి వ్యతిరేకంగా రూపొందించిన వ్యవస్థతో పోరాడడంలో, ఐవైసి ప్రతి అడుగులోనూ వారికి అండగా నిలుస్తుంది" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, రాహుల్ గాంధీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని కెపి గ్రౌండ్‌లో శనివారం 'ఛత్రోన్ కీ గూంజ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ సమస్యపై కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. భారత జాతీయ కాంగ్రెస్ యువజన విభాగమైన భారత యువజన కాంగ్రెస్ 1960 ఆగస్టు 9న స్థాపించారు. ఈ పార్టీ గతంలో కాంగ్రెస్ పార్టీలోనే ఒక భాగంగా ఉండేది. ఆ తర్వాత,అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ దీనిని ఒక అనుబంధ సంస్థగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం, ఈ సంస్థలో రెండు కోట్లకు పైగా సభ్యులు ఉన్నారు. ఈ సంస్థ 'శక్తి సూపర్ షీ' అనే ప్రచారంతో సహా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది0. అయితే, వీటి ప్రధాన లక్ష్యం కాంగ్రెస్ పార్టీతో మహిళల దేశవ్యాప్త అనుబంధాన్ని, భాగస్వామ్యాన్ని పెంపొందించడం, బలోపేతం చేయడం. ఇతర కార్యక్రమాల్లో భారత్ జోడో నాయకత్వ కార్యక్రమం, పెహ్లా ఓటు, ఇందిరా ఫెలోషిప్, యువత హక్కుల కోసం గళం విప్పడం వంటివి ఉన్నాయి. ప్రస్తుతం ఉదయ భాను చిబ్, కృష్ణ అల్లవారు ఈ సంస్థకు అధ్యక్షుడిగా, సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం(ఆగస్టు 9) సందర్భంగా దేశంలోని ఆదివాసీ సోదర సోదరీమణులందరికీ రాహుల్ గాంధీ ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివాసీలే దేశపు అసలైన యజమానులని, వారి విభిన్న సంస్కృతి, సంప్రదాయాలు భారతదేశానికి లభించిన అమూల్యమైన వారసత్వ సంపదగా ఆయన కొనియాడారు. భూమి, అటవీ సంపదపై వారికి ఉన్న హక్కులతో పాటు, వారి అస్తిత్వం ఆత్మగౌరవం కోసం సాగే పోరాటంలో వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

# బ్రహ్మోస్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరిగిన గిరాకీ

**మొదటిపేజీ తరువాయి -**
కొన్ని దేశాలతో భారీ ఒప్పందాలు కూడా ఖరారయ్యాయి. 'ది వీక్' పత్రిక ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం, ఈ క్షిపణి కొనుగోలుకు చర్చలు వేగవంతమయ్యాయి. 2022 జనవరిలో ఫిలిప్పీన్స్‌తో 375 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకున్న భారత్, ఆపరేషన్ సిందూర్ తర్వాత మరిన్ని విజయాలు సాధించింది. వియత్నాం సుమారు 629 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని ఖరారు చేయగా, ఇండోనేషియా కూడా 200 నుంచి 300 మిలియన్ డాలర్ల మధ్య విలువైన ఒప్పందాన్ని ఖరారు చేసుకుంది. యూరప్, పశ్చిమాసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాకు చెందిన డజనుకు పైగా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి వ్యక్తం చేస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే), పాకిస్థాన్‌లోని కీలక ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా, భారత వాయుసేన విమానాలు అంతర్జాతీయ సరిహద్దు దాటకుండానే సుమారు 15 బ్రహ్మోస్ క్షిపణులను పాక్ సైనిక స్థావరాలపై ప్రయోగించాయి. ఈ దాడుల కచ్చితత్వం, తీవ్రత పాకిస్థాన్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ముఖ్యంగా, పాకిస్థాన్ మోహరించిన చైనా నిర్మిత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను బ్రహ్మోస్ విజయవంతంగా ఛేదించడం ఒక కీలక పరిణామం. ఈ క్షిపణి దాడుల ధాటికి తట్టుకోలేకే పాకిస్థాన్ వెంటనే కాల్పుల విరమణకు పిలుపునిచ్చిందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామమే బ్రహ్మోస్‌పై ప్రపంచ దేశాలకు నమ్మకాన్ని పెంచింది. పెరుగుతున్న దేశీయ, అంతర్జాతీయ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని భారత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచింది. హైదరాబాద్, నాగ్‌పూర్, పిలానీలతో పాటు ఇటీవల లక్నోలో కొత్తగా ప్రారంభించిన ప్లాంట్‌లో కూడా ఉత్పత్తి మొదలైంది. ప్రస్తుతం ఈ నాలుగు కేంద్రాల్లో నెలకు కనీసం నాలుగు క్షిపణులను తయారు చేసే సామర్థ్యం ఉండగా, దీనిని మరింత విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత నావికాదళంలోని ప్రతి ప్రధాన యుద్ధనౌక, వాయుసేనలోని ప్రతి ఫైటర్ జెట్‌ను బ్రహ్మోస్‌తో సన్నద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బ్రహ్మోస్ ప్రాజెక్టుకు 1997లో అంకురార్పణ జరిగింది. అప్పటి డీఆర్‌డీఓ చీఫ్ ఏపీజే అబ్దుల్ కలాం నేతృత్వంలోని ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భూమికి సమీపంగా ప్రయాణించే క్రూయిజ్ క్షిపణి లోటును గుర్తించారు. ఈ క్రమంలోనే రష్యాతో కలిసి బ్రహ్మోస్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. డీఆర్‌డీఓ, రష్యాకు చెందిన ఎన్‌పీఓ మషినోస్ట్రోయేనియా సంయుక్త భాగస్వామ్యంతో 'బ్రహ్మోస్ ఏరోస్పేస్' ఏర్పడింది. తొలినాళ్లలో 'పీజే-10' అనే కోడ్‌నేమ్‌తో అత్యంత రహస్యంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. మరోవైపు, బ్రహ్మోస్‌లో కొత్త వేరియంట్ల అభివృద్ధిపై కూడా శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. నీటి అడుగున ప్రయోగించే సామర్థ్యమున్న వెర్షన్, తేలికైన మినీ వేరియంట్‌ను రూపొందించే పనులు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో బ్రహ్మోస్‌ను తయారు చేసి, తేజస్, ఎల్‌సీఏ ఎంకే 2 వంటి దేశీయ యుద్ధ విమానాలకు అనుసంధానించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ చేస్తున్న ప్రయత్నాలకు మరింత బలాన్ని చేకూర్చనుంది.

## రుద్రమదేవి నుంచి శ్రీకృష్ణదేవరాయల వరకు

**మొదటిపేజీ తరువాయి -** సోకినప్పుడు అమ్మవారిని శాంతింపజేయడానికి ఈ పండుగ మొదలైందని చాలామంది భావిస్తారు. కానీ, అంతకు కొన్ని వేల సంవత్సరాల ముందు నుంచే తెలంగాణ గడ్డపై ఈ సంప్రదాయం ఉందని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. చరిత్ర పరిశోధకుడు డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ ప్రకారం, సుమారు 3 వేల ఏళ్ల కిందటే ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించే ఆచారం ఉంది. దీనికి నిదర్శనంగా కామారెడ్డి జిల్లా మరంద్రాళ్ల తండా సమీపంలోని రాతి గుట్టల్లో స్త్రీలు నెత్తిన బోనం ఎత్తుకున్న శిల్పాలు కనుగొన్నారు. అంతేకాకుండా, సుమారు 1600 ఏళ్ల కిందటి విష్ణుకుండినుల కాలం నాటి 'గర్భాపాత్ర' కూడా మేడ్చల్ జిల్లా కీసరగుట్ట వద్ద లభించింది. కాకతీయుల పాలనలోనూ బోనాలు వైభవంగా జరిగాయి. కాకతీయ రాణి రుద్రమదేవి తన కుమార్తె ముమ్మడమ్మకు సంతానం కలగాలని మొగిలిచర్లలోని ఏకవీరాదేవికి బోనం సమర్పించినట్లు ఏకామ్రనాథుడి 'ప్రతాప చరిత్ర' గ్రంథంలో ఉంది. పండితారాధ్య చరిత్రలో కూడా ఈ ఉత్సవాల ప్రస్తావన కనిపిస్తుంది. బోనాల పండుగ గురించి అధికారికంగా ప్రస్తావించిన మొట్టమొదటి శిలాశాసనం శ్రీకృష్ణదేవరాయల కాలం నాటిది. క్రీ.శ. 1516 మే 4న వేయించిన ఈ శాసనం ప్రస్తుతం హైదరాబాద్‌లోని రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాలలో ఉంది. తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని గొబ్బూరులో లభించిన ఈ శాసనంలో, బోనాల పండుగ నిర్వహణ కోసం రాజ్యం నుంచి చెల్లించాల్సిన పన్నులను రద్దు చేస్తున్నట్లు స్పష్టంగా పేర్కొన్నారు. హైదరాబాద్ నిర్మాత మహమ్మద్ కులీ కుతుబ్ షా కాలంలోనూ బోనాల సంప్రదాయం కొనసాగింది. శాలిబండ గ్రామంలో బోనాలు జరుపుకుంటున్న దృశ్యాలున్న ఒక సూక్ష్మ చిత్రపటం దీనికి సాక్ష్యంగా నిలుస్తోంది. గోల్కొండ కోటలోని జగదాంబిక ఆలయంలో గత 400 ఏళ్లుగా ఆషాఢ బోనాలు నిరంతరాయంగా జరుగుతున్నాయి. ఈ ఆధారాలన్నీ పరిశీలిస్తే, 1816లో ప్లేగు వ్యాధి నిర్మూలన కోసం ప్రారంభమైందన్న వాదన కంటే ఎంతో ముందే బోనాల పండుగ తెలంగాణ జనజీవనంలో, సంస్కృతిలో భాగమైందని స్పష్టమవుతోంది.

## నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు.. విద్యార్థుల నిరసన!

**మొదటిపేజీ తరువాయి -** యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిరసనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సీజేఐ, "వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు," "మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సీజేఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకోత్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సీజేఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్‌లో ఒక సంప్రదాయంగా వస్తోంది. కాగా, సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్)లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఇప్పుడు టిస్ తర్వాత నల్సార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.

# ట్రంప్ కొత్త హెయిర్‌స్టైల్‌పై రచ్చ.. సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువ!

**మొదటిపేజీ తరువాయి -** ప్రసంగంలో ఆర్థిక విజయాల గురించి మాట్లాడుతున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఆయన కొత్త హెయిర్‌స్టైల్‌పైనే చర్చ మొదలైంది. ఆగస్టు 5న లాస్ వెగాస్‌లోని రెడ్ రాక్ క్యాసినోలో జరిగిన కార్యక్రమంలో ట్రంప్ పాల్గొన్నారు. అయితే, ఆయన ప్రసంగం కంటే ఆయన తలకట్టే పెద్ద హాట్ టాపిక్‌గా మారింది. నెటిజన్లు ఆయన కొత్త లుక్‌పై మీమ్స్, జోకులతో హోరెత్తించారు. కొందరు "ట్రంప్ పెద్ద జుట్టు మీమ్స్ హద్దులు దాటాయి" అని కామెంట్ చేయగా, మరికొందరు "ట్రంప్ వయసు వెనక్కి వెళ్తోందనడానికి ఇదే నిదర్శనం. ఆయన హెయిర్ అద్భుతంగా ఉంది" అని ప్రశంసించారు. మరోవైపు ట్రంప్ విగ్గు పెట్టుకున్నారని సెటైర్లు పేలాయి. "ది న్యూ ట్రంప్ హెయిర్ సీరమ్" పేరుతో ఒక ఏఐ-జనరేటెడ్ వీడియో కూడా 'ఎక్స్' (ట్విట్టర్)లో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో ట్రంప్ తీరపై ఆయన సోదరుడి కుమార్తె మేరీ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ కొత్త హెయిర్‌స్టైల్ 'రుడాల్ఫ్ ది రెడ్-నోస్డ్ రెయిన్‌డీర్' యానిమేషన్ చిత్రంలోని 'హెర్మీ ది ఎల్ఫ్' పాత్రను గుర్తు చేస్తోందని ఆమె ఎద్దేవా చేశారు. అయితే, ఆ జుట్టు బాగుందా లేదా అనే విషయం తనకు అనవసరమని స్పష్టం చేశారు. అంతటితో ఆగకుండా ట్రంప్ తన జుట్టుపై చూపిస్తున్న శ్రద్ధ.. అల్జీమర్స్ బాధపడుతూ చనిపోయిన తన తండ్రి ఫ్రెడ్ ట్రంప్‌ను గుర్తు చేస్తోందని మేరీ ఆవేదన వ్యక్తం చేశారు. "మా నాన్నకు అల్జీమర్స్ వచ్చిన తర్వాత తన జుట్టు రాలిపోవడంపై తీవ్రంగా ఆందోళన చెందేవారు. సరిగ్గా సరిపోని విగ్గు ధరించేవారు. తన జుట్టుకు, మీసానికి రంగు వేసుకునేవారు. ఇప్పుడు ట్రంప్ ను చూస్తుంటే ఆయనే గుర్తొస్తున్నారు" అని మేరీ ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో ట్రంప్ హెయిర్‌స్టైల్ వ్యవహారం మరింత చర్చనీయాంశంగా మారింది.



# నెల్లూరులో "థాట్ బోట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్" ప్రారంభం



**నెల్లూరు,ఆగస్టు 09, (సీమకిరణం న్యూస్):** నెల్లూరు నగరంలోని వనం తోపు సెంటర్ ప్రాంతంలో థాట్ బోట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బ్రాంచ్ ప్రారంభానికి ముఖ్యఅతిథిగా థాట్ బోట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో (బ్రెజిల్) అన్వర్ అహ్మద్ పాల్గొని.. థాట్ బోట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నెల్లూరు బ్రాంచ్ మేనేజర్లు షేక్ మున్నా, ఉమర్ లతో కలసి లాంచనంగా ప్రారంభించారు.థాట్ బోట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నెల్లూరు బ్రాంచ్ ప్రారంభానికి విచ్చేసిన సీఈవో (బ్రెజిల్) అన్వర్ అహ్మద్ కు శాలువాతో ఘనంగా సత్కరించి.. పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా థాట్ బోట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నెల్లూరు బ్రాంచ్ మేనేజర్లు షేక్ మున్నా మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని వనంతో సెంటర్ దగ్గర థాట్ బోట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బ్రాంచ్ ని ప్రారంభించడం జరిగిందన్నారు.ఈ థాట్ బోట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ లో ఇండియా బ్యాంకింగ్ సెక్టార్స్, బ్యాంకింగ్,ఐటీ,సాఫ్ట్వేర్ డెవలప్మెంట్,ఉద్యోగ అవకాశాలు కల్పించే సేవలు అందించడం జరుగుతుందన్నారు. నెల్లూరు జిల్లాలో ఉన్న నిరుద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్నేహితులు బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా మాయలో పడవద్దు

ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

నెల్లూరు రూరల్ డిఎస్పి శ్రీనివాసులు

ఘనంగా శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ ఫ్రెషర్స్ డే







**నెల్లూరు,ఆగస్టు 09, (సీమకిరణం న్యూస్):** సోషల్ మీడియా మాయలో పడి ఎంతోమంది జీవితాలు నాశనం చేసుకుంటున్నారని విద్యార్థులందరూ సరైన లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్యాన్ని సాధించే విధంగా ముందుకు సాగాలని నెల్లూరు రూరల్ డిఎస్పి శ్రీనివాసులు పేర్కొన్నారు. శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నెల్లూరు నగరంలోని టౌన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డి.ఎస్.పి కట్టపనేని శ్రీనివాసులు పాల్గొని శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ ఏజీఎం శ్రీరామ్,ప్రిన్సిపాల్ సరిత రెడ్డిలతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి.. కాలేజ్ ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఇంటర్మీడియట్ మొదటి,రెండవ సంవత్సరంలో అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థులకు శాలవాలతో ఘనంగా సత్కరించి.. మెడల్,ప్రశంస పత్రాన్ని అందజేసి.. శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దిశా నిర్దేశం చేసేదే ఇంటర్మీడియట్ అని.. సమయాన్ని వృధా చేసుకోకుండా కష్టపడి చదివి.. చదువు చెప్పిన అధ్యాపకులకు,మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని వచ్చే విధంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.క్రమ శిక్షణతో ముందుకు సాగాలని,సోషల్ మీడియా లో పడి జీవితాలను నాశనం చేసుకోకుండా చదువుపై దృష్టి సాధించే లక్ష్యాలకు చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# డోన్‌లో ఘనంగా బైబిల్ మిషన్ తైలాభిషేక పండుగ

వందలాది మంది భక్తులకు అభిషేక తైలంతో ప్రార్థనలు, నిరుపేదలకు వస్త్రాలు పంపిణి




**డోన్ టౌన్, ఆగస్టు 09,(సీమ కిరణం న్యూస్):** డోన్ పట్టణంలోని వైఎస్ఆర్ నగర్ ప్రాంతంలో బైబిల్ మిషన్ గుంటూరు హెడ్ ఆఫీస్ ఆధ్వర్యంలో రాయలసీమ ప్రాంతీయ బైబిల్ మిషన్ జూలై నుండి ఆగస్టు వరకు నిర్వహించే 40 రోజుల మోషే ఉపవాస ప్రార్థనల సమాప్తిని పురస్కరించుకుని, ప్రత్యేకించి బైబిలు మిషన్ సంప్రదాయంలో ఈ తైలాభిషేక పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ పవిత్ర దినాన దైవజనులు పరిశుద్ధ తైలంతో విశ్వాసులకు అభిషేకం చేయడం, ప్రత్యేక ప్రార్థనలు మరియు ఆరాధనలు నిర్వహిస్తారు.ఈ కార్యక్రమానికి నంద్యాల,డోన్,ప్యాపిలి,అనంతపురం,ఎర్రగుడి తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. బైబిల్ మిషన్ ద్వారా నిర్వహించిన ఈ తైలాభిషేక కార్యక్రమంలో దైవ సేవకులు, భక్తులకు తైలాభిషేకంతో ప్రార్థనలు నిర్వహించారు.దేవుని ఆశీస్సులతో భక్తులకు నూతన శక్తి, ఆరోగ్యం,మేలు,ఆయుష్షు కలగాలని ప్రార్థనలు చేశారు. భక్తులు విశ్వాసంతో తైలాభిషేకం పొందారు. కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితుడిగా అనంతపురం జిల్లా పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు మరియు ఆయన సతీమణి కలిసి వచ్చి పాల్గొన్నారు.స్థానిక వైఎస్ఆర్ నగర్ బైబిల్ మిషన్ చర్చి సంఘ కాపరి రెవరెండ్ బందెల రాజు బైబిల్ మిషన్ ఏవో ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. తైలాభిషేక పండుగ సందర్భంగా భక్తులకు ఉచితంగా భోజనం ఏర్పాటు చేయడంతో పాటు నిరుపేదలకు నూతన వస్త్రాలను బహుమతిగా అందజేశారు.భక్తులకు ఆశీర్వాద భోజనం,తైలాభిషేకం అందించి పంపించారు.సేవా కార్యక్రమాలతో కూడిన ఈ ఆధ్యాత్మిక పండుగ పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో బ్రదర్ మణిరాజు,బైబిల్ మిషన్ సంఘ సభ్యులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రార్థనలు,తైలాభిషేకం,అన్నదానం,వస్త్రాల పంపిణీతో కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా ముగిసింది.

# డోన్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2కే వాక్ కార్యక్రమం






**డోన్ టౌన్, ఆగస్టు 9, (సీమ కిరణం న్యూస్):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని డోన్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 2కే వాక్ నిర్వహించారు. మునిసిపాలిటీ కార్యాలయం సమీపం నుంచి నగరవనం వరకు వాక్ కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ, నిత్య వ్యాయామం ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ వాక్ నిర్వహించారు. స్వాతంత్ర్య స్ఫూర్తితో పాటు ఆరోగ్యం పై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే కార్యక్రమ ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్, ఫారెస్ట్ సిబ్బంది పోలీసుల సిబ్బంది చిన్నపిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి,సంక్షేమం,ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

-మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

-మంత్రి ఆనం ఆధ్వర్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా స్థాయి సమావేశం





**నెల్లూరు,ఆగస్టు 09, (సీమకిరణం న్యూస్):** రెండేళ్ల అభివృద్ధి, కూటమి ప్రభుత్వ సుపరిపాలనపై ప్రజలు ప్రగాఢ విశ్వాసం ఉంచారని,ఆ నమ్మకాన్ని మరింత నిలబెట్టుకునేలా రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు.తెలుగుదేశం పార్టీ సరికొత్త విజయాలకు చిహ్నంగా నూతన హంగులతో ముస్తాబైన నెల్లూరు సంతపేటలోని ఆనం క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఆనం ఆధ్వర్యంలో తొలిసారిగా ఉమ్మడి నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముందు నందమూరి తారక రామారావు విగ్రహానికి ప్రజా ప్రతినిధులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.సమావేశంలో జిల్లాలో పార్టీ పరిస్థితి,ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పెండింగ్ పనులు, సాగునీరు,తాగునీరు, భవిష్యత్‌లో సుపరిపాలనను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడం,పార్టీ పరంగా ఎదురవుతున్న సమస్యలను అధిగమించి పార్టీని మరింత బలోపేతం చేయడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సమావేశానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్,వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ,పార్టీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి తదితరులు హాజరయ్యారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతం,సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు,పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రజా ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు అందించిన సూచనలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తున్నట్లు చెప్పారు.రెండేళ్ల అభివృద్ధి, ప్రభుత్వ సుపరిపాలనపై ప్రజలు ప్రగాఢ విశ్వాసం ఉంచారని, ఆ నమ్మకాన్ని మరింత నిలబెట్టుకునేందుకు రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేయాలని నిర్ణయించినట్లు వివరించారు.టీడీపీ జిల్లా అధ్యక్షులు,ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులు,భవిష్యత్తులో సాగునీరు,తాగునీటిని ఏ విధంగా సమకూర్చాలి, ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారుజిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కూడా సమీక్షించినట్లు చెప్పారు.పార్టీ పరంగా నియోజకవర్గాల వారీగా సభ్యత్వ నమోదు,నూతన కమిటీల నిర్మాణం జరుగుతోందని,ఇప్పటికే 90 శాతానికి పైగా ప్రగతి సాధించామని తెలిపారు. మిగిలిన ప్రక్రియను కూడా త్వరలో పూర్తి చేసి పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు.రాబోయే రోజుల్లో నియోజకవర్గాల వారీగా,మండలాల వారీగా మోటార్ బైక్ యాత్రలు నిర్వహించి పార్టీ శ్రేణులతో మరింత సమన్వయం సాధించేలా కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు.పార్టీ జోనల్ కోఆర్డినేటర్,గోపాలపురం ఎమ్మెల్యే వెంకటరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి,టీడీపీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పార్టీ నాయకులతో క్షేత్రస్థాయి అంశాలపై చర్చించి పార్టీ కార్యక్రమాలు, కూటమి ప్రభుత్వ పరిపాలనపై దిశానిర్దేశం చేస్తున్నారని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యత ఇస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొందన్నారు.నారా లోకేష్ నాయకత్వంలో యువతకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ బాధ్యత తీసుకుని 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ చేపట్టారని చెప్పారు.మెగా డీఎస్సీ ద్వారా వేలాది నిరుద్యోగ యువత కలలు సాకారం కానున్నాయని, అనేక కుటుంబాల భవిష్యత్తు మారబోతోందని వెంకటరాజు అన్నారు. గతంలో నిరుద్యోగుల ఆశలను దెబ్బతీసిన వైఎస్సార్సీపీ నాయకులు ఇప్పుడు డీఎస్సీ పేరుతో ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే మేయర్‌గా ఉన్నా

నెల్లూరు నగర మేయర్ దేవరకొండ సుజాత

ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు



**నెల్లూరు,ఆగస్టు 09, (సీమకిరణం న్యూస్):** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కులు,అవకాశాల వల్లే తాను గిరిజన మహిళగా నగర మేయర్‌గా ఉన్నానని నెల్లూరు నగర మేయర్ దేవరకొండ సుజాత అన్నారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నెల్లూరు నగరంలోని బీవీ నగర్ లో గల గిరిజన భవన్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నగర మేయర్ దేవరకొండ సుజాత,ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్ రెడ్డి,ఐటీడీఏ పీఓ సుజాత, గిరిజన సంఘాల నాయకులు,గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేయర్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ తాను కూడా గిరిజన మహిళనేనని, గిరిజనుల సమస్యలను తాను అర్థం చేసుకోగలనని అన్నారు.ఆధార్ కార్డు తదితర సమస్యల కోసం గిరిజనులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అభివృద్ధికి సంబంధించి ఏ సమస్య ఉన్నా తనకు తెలియజేయాలని,ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. గిరిజనులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని,తన పరిధిలో లేని సమస్యలను మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.పేదరికాన్ని అధిగమించాలంటే విద్యే ప్రధాన మార్గమని పేర్కొన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని,ప్రభుత్వ పాఠశాలలు కూడా ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు.ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. విద్య ద్వారా గిరిజన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజంలో గౌరవంగా జీవించాలని ఆకాంక్షించారు.ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పేదలు, గిరిజనుల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సమాజంలో చిట్టచివరి స్థానంలో ఉన్న గిరిజనులకు చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సేవాభావంతో పనిచేయాలని సూచించారు.గిరిజనుల జీవనోపాధికి గతంలో మత్స్యశాఖ ద్వారా చెరువుల్లో చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని తిరిగి పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో గిరిజనుల అభ్యున్నతికి ఏర్పాటు చేసిన సొసైటీలను తిరిగి బలోపేతం చేయాలని కోరారు.గిరిజన ప్రాంతాల్లో విద్యాశాతం పెరగాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని తెలిపారు.గిరిజన సంఘాలన్నీ విడివిడిగా కాకుండా ఒక జేఏసీగా ఏర్పడి ప్రతి 15 రోజులకు లేదా నెలకు ఒకసారి సమావేశమై సమస్యలపై ఉమ్మడిగా కృషి చేయాలని సన్నపరెడ్డి సురేష్ రెడ్డి సూచించారు.ఎమ్మెల్యేలు, కలెక్టర్,ఉన్నతాధికారులను కలిసి జూనియర్ కాలేజీలు, విద్యా,మౌలిక వసతులు సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కొండ ప్రాంత గిరిజనులతో సమానంగా మైదాన ప్రాంత గిరిజనులకు కూడా న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. మైదాన ప్రాంత గిరిజనులకు ఐటీడీఏ నిధులు తగిన స్థాయిలో అందేలా చూడాలని కోరారు. భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన జరిగే సమయంలో మైదాన ప్రాంతాల నుంచి గిరిజన ఎమ్మెల్యే స్థానాలు పెరిగే అవకాశం ఉందని,అందుకు గిరిజనులు రాజకీయంగా సిద్ధంగా ఉండాలని అన్నారు.గిరిజనుల హక్కులు,అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ ఒక సోదరుడిగా,భాగస్వామిగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు పలు సమస్యలను నేతల దృష్టికి తీసుకువచ్చారు.

# సత్‌ప్రవర్తనతో జీవించండి.. నేర ప్రవృత్తికి స్వస్తి పలకండి

-నెల్లూరు జిల్లా ఎస్పీ డా అజిత వెజెండ్ల

-జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లు,హిస్టరీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించిన పోలీసులు




**నెల్లూరు,ఆగస్టు 09,(సీమకిరణం న్యూస్):** నెల్లూరు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ,నేరచరిత్ర కలిగిన వ్యక్తులు సత్ప్రవర్తనతో జీవించేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డా అజిత వెజెండ్ల సూచనలు మేరకు) జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు,కేడిలు, డిసిలు,ఇతర నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు పోలీసు అధికారులు ప్రత్యేక సత్ ప్రవర్తనా కౌన్సిలింగ్లు నిర్వహించారు.కౌన్సిలింగ్ సందర్భంగా నేరాలకు దూరంగా ఉండి సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని సూచించారు.చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజా శాంతికి భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు అని, రౌడీయిజం,దౌర్జన్యాలు, బెదిరింపులు,గొడవలు, ఇతర శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు.ప్రజా శాంతికి భంగం కలిగించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలు,బాలికలపై వేధింపులు,లైంగిక దాడులు,అత్యాచారాలు వంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వేగవంతమైన దర్యాప్తు, విచారణ ద్వారా శిక్షలు ఖాయం చేస్తామని హెచ్చరించారు.జిల్లాలో నేరాలకు పాల్పడిన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగుతోందని, ప్రజా శాంతికి భంగం కలిగించే పరిస్థితులు సృష్టిస్తే అవసరమైతే పిడి ఏసిటీ కింద చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించామని, మారుమూల ప్రాంతాల్లో కూడా నిఘా వ్యవస్థను బలోపేతం చేశామని తెలిపారు.బీట్ వ్యవస్థను మరింత పటిష్టంగా అమలు చేస్తూ నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు వెల్లడించారు. నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని,కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా జీవనోపాధి పొందాలని సూచించారు.ప్రజలు తమ ప్రాంతాల్లో అల్లర్లు,గొడవలు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించి సమాచారం తెలిసిన వెంటనే డయల్-112, పోలీసు కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్ o91 93929 03413 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

# ఘనంగా 1987-88 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పూర్వ విద్యార్థులందరూ ఒకే చోట కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది




**నెల్లూరు,ఆగస్టు 09, (సీమకిరణం న్యూస్):** ముత్తుకూరు మండల కేంద్రంలో ఉన్న ఈదురు ఈశ్వరమ్మ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88వ సంవత్సరంలో 10 వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ కలిసి ఒక వేదికగా ఏర్పడి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నెల్లూరు నగరంలోని శుభం కన్వెన్షన్ హాల్లో ఘనంగా జరుపుకున్నారు.అనంతరం ఒకరికొకరు కలుసుకుంటూ.. చదువుకున్న తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ.. పూర్వ విద్యార్థులందరూ సరదాగా గడిపారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ముత్తుకూరు మండల కేంద్రంలో ఉన్న ఈదురు ఈశ్వరమ్మ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్నామని.. ఒక వేదికగా ఏర్పడి పూర్వ విద్యార్థులందరూ 38 సంవత్సరాల తర్వాత మొదటి గెట్ టుగెదర్ ని గత సంవత్సరం లో ముత్తుకూరు మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు.ె గట్ టుగెదర్ ని ప్రతి సంవత్సరం నిర్వహించుకోవాలని.. పూర్వ విద్యార్థుల ందరూ ఒక వేదిక ఏర్పడి నిర్ణయం తీసుకున్నామన్నారు. రెండవ గెట్ టుగెదర్ ని నెల్లూరులో నిర్వహించుకోవాలని విద్యార్థులు అందరూ చెప్పడంతో 2వ గెట్ టుగెదర్ ని కూడా పూర్వ విద్యార్థులతో కలిసి ఎంతో ఆనందంగా,సరదాగా.. చదువుకున్న పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ.. ఎంతో సరదాగా గడిపామన్నారు. పూర్వ విద్యార్థులందరూ కలిసి రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, స్నేహితులు, బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవ వేడుకలు






నా ఉద్యోగ విరమణలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు : జి కృష్ణారావు

**నెల్లూరు, ఆగస్టు 09, (సీమకిరణం న్యూస్):** 38 సంవత్సరాలుగా జీ కృష్ణారావు పరిశ్రమల శాఖలో వివిధ హోదాలలో విధులు నిర్వహించి జి కృష్ణారావు ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా నెల్లూరు నగరంలోని మినీ బైపాస్ రోడ్ లో పడారుపల్లి దగ్గర ఉన్న ఓ కళ్యాణ మండపంలో ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సన్మాన మహోత్సవ కార్యక్రమానికి పలువురు ఉద్యోగస్తులు,విశ్రాంతి ఉద్యోగస్తులు,బంధుమిత్రులు పాల్గొని.. ఉద్యోగ విరమణ చేసిన జీ కృష్ణారావుకు పూలమాలలు,పుష్పగుచ్చాలు అందజేసి.. శాలువాలతో ఘనంగా సత్కరించి.. వీడ్కోలు పలికారు.38 సంవత్సరాలుగా చిరువెళ్ల వీర రాఘవులు పరిశ్రమ శాఖలో విధులు నిర్వహించి.. పరిశ్రమ శాఖకే ఆయన మంచి పేరు తీసుకుని వచ్చారని పలువురు కొనియాడారు.ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన జి కృష్ణారావు మాట్లాడుతూ తన విధి నిర్వహణలో సహకరించిన ఉన్నతాధికారులందరికీ, అలాగే తన ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవంలో పాల్గొని.. తనకు వీడ్కోలు పలికిన ప్రతిఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు,విశ్రాంతి ఉద్యోగులు,బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు

# ఎముకలకు బలమిద్దాం!



జీవనశైలిలో మార్పులు, ఆహారంలో పోషకాలు లోపించడం, ఇతర కారణాల వల్ల నడి వయసులోనే ఎన్నెన్నో రుగ్మతలు పలకరిస్తున్నాయి. యుక్త వయసులోనే కీళ్ల నొప్పుల బారినపడుతున్నారు. విటమిన్ డి, క్యాల్షియం లోపంతో చాలామంది ఎముకలకు సంబంధించిన సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎముక నిర్మాణంలో క్యాల్షియం ఎంత ముఖ్యమో విటమిన్ డి అంతే ముఖ్యమైనది. ఈ రెండూ సరిపడా అందితేనే ఎముకలు పటిష్టంగా ఉంటాయి. ఆహారం ద్వారా శరీరంలోకి చేరిన క్యాల్షియం ఎముకకు చేరాలంటే విటమిన్ డి కీలక పాత్ర పోషిస్తుంది. క్యాల్షియంను చేర్చే క్రమంలో విటమిన్ డి ఒక వాహకంలా పనిచేస్తుంది. విటమిన్ డి తగినంత లేకుంటే ఆహారం, సప్లిమెంట్స్ ద్వారా ఎంత క్యాల్షియం తీసుకున్నా వ్యర్థమవుతుంది. అందుకే క్యాల్షియంతో పాటు విటమిన్ డి కూడా శరీరానికి అందించాలి. నిజానికి మన చర్మంలో క్రియారహిత రూపంలో విటమిన్ డి ఉంటుంది. ఎప్పుడైతే సూర్యరశ్మి తగులుతుందో అప్పుడు డి విటమిన్ యాక్టివ్ అవుతుంది. అందుకే ప్రతి రోజు ఉదయం పూట కనీసం గంట సేపు ఎండ తగిలేలా చూసుకోవాలి.

**బలహీనం కావడం వెనుక..**

శరీరంలో క్యాల్షియం, విటమిన్ డి తగ్గటం
అధిక బరువు, వ్యాయామం లేకపోవటం
మద్యపానం, ధూమపానం దురలవాట్లు
సూర్యరశ్మి సోకకుండా ఉండటం
పోషకాహార లోపం


**నివారణ ఇలా..**

చిన్న వయస్సు నుంచే జాగ్రత్త పడాలి ప్రతి రోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి ఉదయం 8 గంటల లోపు సూర్యరశ్మి సోకేలా జాగ్రత్తపడాలి మద్యపానం, ధుమపానం లాంటి వ్యసనాలకుదూరంగా ఉండాలి క్యాల్షియం, విటమిన్ డి ఉన్న ఆహారం తీసుకోవాలి క్యాల్షియం ఉండే పదార్థాలుపాలకూర, కరివేపాకు, క్యారెట్, నువ్వులు, గడ్లు, సోయాబీన్స్, బాదం, బ్రకోలీ, పాలు, పెరుగు, క్యాబేజీ, నారింజ, చిరు ధాన్యాలు.

**విటమిన్ డి ఉండే పదార్థాలు**

చేపలు, చేప నూనెలు, గుడ్డు పచ్చసొన, చీజ్, కాలేయం, పుట్టగొడుగులు, పాలు, పెరుగు, పాల ఉత్పత్తులు, సూక్ష్మ పోషకాలు కలిసిన నూనెలు, చిరుధాన్యాలు, నువ్వులు.

# సత్యనిష్ఠే.. ఏకైక మార్గం



'భావనమే' జీవనం. జీవ దేహం కేవలం ఒక ఉపకరణం. ఇంద్రియ గ్రహణం, ప్రజ్ఞ, ఉద్వేగాలు, అభ్యాసం, అస్తిత్వరూపం, నిర్ణయాలు, పట్టుదల, అనుభూతి విస్తృతి.. అన్నీ భావప్రపంచమే. అయితే .. ఈ భావప్రపంచం సత్య, శాంత, స్పష్ట సమర్థతతో, సుసంస్కారంతో సాగాలంటే.. శరీరం సంతులిత సమర్థతతో పనిచేస్తూ ఆరోగ్యంగా ఉండటం అత్యవసరం. కానీ, తగినంత ఆరోగ్యంగా ఉన్నవారిలో కూడా చాలావరకు భావప్రపంచం సమర్థతతో పనిచేయకపోవడం కీలకమైన సమస్య. అందులోనూ అధికారం, ధనం, విద్య (మేధస్సు) ఉన్నవారిలో ఈ దోషం ఉండటం సమాజానికి ప్రబలమైన సమస్య. భావప్రపంచాన్ని సంస్కారబలంతో నడుపగలిగింది సదా 'సత్యనిష్ఠ'. సత్యజీవనం.. విద్య. అసత్య జీవనం.. అవిద్య. దైనందిన మానవ జీవనం సత్యాసత్యాల 'మిశ్రమం'. 'సమానతా భావమయమైన' సరళజీవనం, సమష్టి శాంతి, నిర్భయత, ఆరోగ్యం, కృషి, పరస్పర ఆదరణ, ఆధ్యాత్మిక సాధన, సంతృప్తి, ఆనందానుభవం ఇవన్నీ అనివార్యంగా సత్యాన్ని ఆశ్రయించి సాగుతుంటాయి. 'ఆధిక్యతాభావమయమైన' సంపద్గత జీవనం, కాంక్ష , ప్రకృతిశోషణ, ఘర్షణ, హననం, ఆక్రమణ, ప్రాణనష్టం, భయం ఇవి అసత్యాన్ని ఆశ్రయించి సాగుతాయి. మానవ 'జీవితాన్ని శాసించవలసిన సత్యాలు ఇవి..


**వ్యక్తిస్థాయిలో..**

'యద్దృశ్యం తన్నశ్యం'- కనిపించే 'పదార్థజగత్తు' ఏ మినహాయింపు లేకుండా%ొ% ఎప్పటికైనా కాలం మింగేసేదే. లోకంలో అందరూ మరణించినట్లే నేనూ పోతానుబీ నేను నా పూర్వీకులను గుర్తుచేసుకోనట్లే, తరువాతి కాలంలో నన్ను ఎవరూ తలచుకోరు.. అన్న బలమైన స్పృహతో సహజంగా జీవించడం.నేను, నా గొప్పతనం ఎంతోమంది సహాయ సహకారాల వల్ల రూపుదిద్దుకున్నదే కానీ, కేవలం నా కృషివల్ల కాదు అన్న ఎరుక కలిగి కృతజ్ఞతతో జీవించడం.ఎన్ని గొప్పపనులు చేసినా.. దైవం (ప్రకృతి) ప్రసాదించిన విశిష్ఠతతో తాను నిర్వహించిన ధర్మంగానే భావిస్తూ.. సామాన్యులతో తాదాత్మ్యత వదులుకోకుండా ఉండటం.

**సామాజిక స్థాయిలో..**

పంచభూతాలు మానవ సృష్టికాదు కాబట్టి.. ఏ వ్యక్తులకూ వాటిపై సొంత ఆస్తిగా వాడుకునే హక్కు ఉండని వ్యవస్థను ఏర్పాటు చేసుకునే నిష్ఠ కలిగి ఉండటం. ఏ సమాజాలకు సాంస్కృతికమైన ఏ విశిష్టతలు ఉన్నా మౌలిక స్థాయిలో అహింస, ఆత్మీయత అందరికీ ఉండి తీరవలసిందన్న స్పృహ కలిగి ఉండటం. ఎవరి మత విశ్వాసాలూ, దైవాలూ, ఆచారాలూ, లోకాలూ వారికున్నా %ొ% అందరి 'మౌలిక చైతన్యం' ఒక్కటే అన్న స్పృహతో పరస్పర నిర్ద్వేషంతో, ఆదరణతో జీవించాలన్న నిశ్చయబలం.

# మళ్లీ 30 విమానాలకు బాంబు బెదిరింపు ఇండిగో విమానాలు మిడిల్ ఈస్ట్ దేశాలకు మళ్లింపు..!



విమానాలకు బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. ఇటీవల వరుసగా విమానాల్లో బాంబు ఉందంటూ ఫోన్లు, సోషల్ మీడియా పోస్టుల్లో పేర్కొనడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. తాజాగా దేశీయ విమానయాన సంస్థలు నిర్వహిస్తున్న జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు దాదాపు 30కిపైగా బాంబు బెదిరింపులు వచ్చాయి. సోమవారం రాత్రి నుంచి 30కిపై బెదిరింపులు వచ్చాయని అధికార వర్గాలు తెలిపాయి. బెదిరింపుల నేపథ్యంలో జెడ్డాకు వెళ్లాల్సిన మూడు ఇండిగో విమానాలను సౌదీ అరేబియా, ఖతార్ విమానాశ్రయాలకు మళ్లించారు. ఇండిగో, విస్తారా, ఎయిర్ ఇండియా విమానాలకు బెదిరింపులు వచ్చినట్లు సమాచారం. గతవారం రోజుల్లో భారతీయ విమానయాన సంస్థలు నిర్వహిస్తున్న 120కిపైగా విమానాలకు బెదిరింపులు వచ్చాయి. పది ఇండిగో విమానాలకు హెచ్చరికలు అందినట్లు ఎయిర్‌లైన్ ప్రతినిధి ఒకరు మంగళశారం తెలిపారు. బెంగళూరు %-% జెడ్డా (6%జు% 77) విమానం దోహాకు, కోజికోడ్ %-% జెడ్డా (6%జు% 65) విమానం రియాద్, ఢిల్లీ %-% జెడ్డా విమానం (6%జు% 63) మదీనాకు మళ్లించారు. ఈ మూడు విమానాలను మిడిల్ ఈస్ట్ దేశాలకు మళ్లించారు. వీటితో పాటు ఢిల్లీ %-% దమ్మాం, ఇస్తాంబుల్ %-% ముంబయి, ఇస్తాంబుల్ %-% ఢిల్లీ, మంగళూరు %-% ముంబయి, అహ్మదాబాద్ %-% జెడ్డా, హైదరాబాద్ %-% జెడ్డా, లక్నో నుంచి పుణే విమానాలకు బెదిరింపులు వచ్చాయని ప్రతినిధి పేర్కొన్నారు. బెదిరింపుల నేపథ్యంలో ప్రోటోకాల్ మేరకు సంబంధిత అధికారులు అప్రమత్తమయ్యారని ఎయిర్ ఇండియా ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. విస్తారా ప్రతినిధి మాట్లాడుతూ సోమవారం పలు విమానాలకు సోషల్ మీడియాలో భద్రతా బెదిరింపులు వచ్చాయని చెప్పారు. ఆయా బాంబు బెదిరింపుల్లో ఎలాంటి వాస్తవం లేదని తేలింది. వరుసగా బెదిరింపుల నేపథ్యంలో అటు ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారడంతో పాటు ఇటు వియానయాన సంస్థలకు సైతం పెద్ద తలనొప్పిగా మారింది. బెదిరింపులను తీవ్రంగా పరిగణించనున్నట్లు పౌర విమానయానశాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులను నో ఫ్లై జాబితాలో చేర్చనున్నారు. విమానాలను పేల్చివేస్తామని బెదిరించే వారిని కఠినంగా శిక్షించేలా ఎయిర్‌క్రాఫ్ట్ సెక్యూరిటీ రూల్స్‌లో మార్పులు చేసేందుకు సైతం యోచిస్తున్నారు.

# ఇదేం మాయరోగమో?!



వదలని జలుబు.. ఆగని దగ్గు.. తగ్గని నొప్పులు


జలుబు, దగ్గు, ఒంటి నొప్పులుప్రస్తుతం ఎవరిని పలకరించినా ఇదే చెబుతున్నారు. మొన్నటి వరకు అంటే వానలు కురవడం, వాతావరణ మార్పుల వల్ల జలుబు, దగ్గు, జ్వరం వచ్చాయనుకున్నారు. వానలు తగ్గినా, మందులు వాడినా పట్టిన జలుబు వదలడం లేదు. వచ్చిన దగ్గు పోవడం లేదు. చాలామంది ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులతో సతమత మవుతున్నారు. 'ఇదేం మాయ రోగమో' అని ఉసూరుమంటున్నారు. ఏమైందో అర్థం కాక జనాలు దవాఖానలకు క్యూ కడుతున్నారు.అయితే ప్రస్తుతం వైరల్ ఫీవర్లు వస్తున్నప్పటికీ అవి ఏ రకమైన వైరస్‌లు? ఎందుకు దీర్ఘకాలంగా పట్టి పీడిస్తున్నాయి? వీటికి ఎలాంటి చికిత్స అవసరం? తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం. ఇటీవల ఏ నలుగురిని పలకరించినా ఒకరో ఇద్దరో జ్వర బాధితులమని చెబుతున్నారు. జ్వరం తగ్గినా కీళ్ల నొప్పులతో సతమతమవుతూనే ఉన్నారు. ఎన్ని మందులు వాడినా ఆ పూట కొంత ఉపశమనం కలుగుతోంది. ఆ తర్వాతి రోజు పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందని వాపోతున్నారు. వర్షకాలంలో ఇలా సీజనల్ వ్యాధులు రావడం సాధారణమే. అందులో ముఖ్యంగా ఇన్‌ఫ్లుయెంజా (జలుబు, దగ్గు, జ్వరం) దోమల కారణంగా డెంగి, చికున్ గున్యా, మలేరియా వంటి విషజ్వరాలు రావడం కూడా సర్వసాధారణమే. కానీ, ఈ సీజన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా జ్వరాలు వారాల తరబడి బాధపెడుతున్నాయి. కొందరు జ్వరంతో ఇబ్బందిపడుతుంటే మరికొందరు నెలల పాటు జలుబు, దగ్గు, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులతో సతమతమవుతున్నారు. వర్షకాలం, చలికాలంలో సీజనల్ వ్యాధులు రావడం సహజం. అయితే సీజన్‌లో ఎక్కువగా ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ప్రభావం చూపుతుంది. ఇందులో చాలారకాల వైరస్‌లు ఉంటాయి. ప్రస్తుతం ఇన్‌ఫ్లుయెంజా-ఎ, రెస్పిరేటరీ సిన్సిషియల్ వైరస్‌లు విజృంభిస్తున్నాయి. అత్యధిక మంది రోగులు ఈ వైరస్‌ల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రెస్పిరేటరి సిన్సిషియల్ వైరస్ వల్ల రెండు మూడు వారాల పాటు జలుబు, దగ్గు, జ్వరం లాంటి లక్షణాలతో బాధపడుతుంటారు. ఇవి తీవ్రమై ఎక్కువ రోజులు పీడించినట్లయితే.. డెంగీ వంటి విషజ్వరాలు సోకాయని రోగులు భయపడుతున్నారు. ఈ లక్షణాలు ఉన్నప్పుడు సొంత వైద్యం తీసుకోకుండా వైద్యులను సంప్రదించడం మంచిది. వైద్యుల సూచన మేరకే మందులు వాడాలి.

**మ్యుటేషన్‌ల వల్లే ఎక్కువ రోజులు..**

వైరస్‌లు రూపాంతరం చెంది, కొత్త మ్యుటేషన్‌లు ఏర్పడటం వల్ల వ్యాధి లక్షణాలు ఎక్కువ కాలం రోగులను పీడిస్తున్నాయి. వైరస్‌లలోని జన్యువులలో మ్యుటేషన్లు జరగడం వల్ల వైరస్‌లు రూపాంతరం చెందుతాయి. కొన్ని మ్యుటేషన్ల వల్ల ఆ వైరస్‌లు బలహీన పడతాయి. వీటి వ్యాప్తి అధికంగా ఉన్నా.. రోగులపై ఎక్కువగా ప్రభావం చూపదు. కొన్ని మ్యుటేషన్‌ల వల్ల వైరస్‌లు బలపడతాయి. వీటి వ్యాప్తి తక్కువగా ఉన్నా రోగ తీవ్రత మాత్రం అధికంగా ఉంటుంది. కోవిడ్ 19 నాటి పరిస్థితులను పరిశీలిస్తే ఇది అర్థమవుతుంది. కరోనా ఫస్ట్‌వేవ్ కంటే సెంకడ్ వేవ్‌లో వచ్చిన మ్యుటేషన్స్ వల్ల వైరస్ బలపడింది. ఫలితంగా వైరస్ వ్యాప్తి తక్కువగా ఉన్నప్పటికీ ఎక్కువ మంది దాని బారినపడ్డారు. అదే థర్డ్‌వేవ్‌లో ఒమిక్రాన్ వేరియంట్‌లో కోవిడ్ మెదటి, రెండో వేవ్ కన్నా వైరస్ వ్యాప్తి అధికంగా ఉంది. కానీ, ప్రభావ తీవ్రత తక్కువగా కనిపించింది. దానివల్ల రోగులు దవాఖానలో చేరాల్సిన అవసరం లేకుండానే కోలుకున్నారు. చాలామందికి వైరస్ సోకినట్లు కూడా తెలియదు. వాళ్లలో ఆ వైరస్ అసింప్టమ్యాటిక్‌గా (లక్షణాలు బయటపడకుండా) వచ్చిపోయింది. ఇలాంటి మ్యుటేషన్స్ వల్ల ఏర్పడిన ఇన్‌ఫ్లుయెంజా-ఎ, రెస్పిరేటరీ సిన్సిషియల్ వైరస్‌లు కొంత బలపడతాయి కూడా. ఇలాంటి మ్యుటేషన్ల వల్ల ఏర్పడ్డ వైరస్‌లు తీవ్రమైన ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ఇవి సోకితే జలుబు, దగ్గు, జ్వరం, ఒంటి నొప్పులు తీవ్రంగా ఉంటాయి. అంతే కాకుండా ఎక్కువ రోజులు పీడిస్తాయి.

**స్వైన్‌ఫ్లూతో సమానం**

ఇన్‌ఫ్లుయెంజా-ఎ అనేది ఒక రకంగా చెప్పాలంటే స్వైన్‌ఫ్లూ వైరస్. దీని వ్యాప్తి రేటు అధికంగా ఉంటుంది. ఇది ఒకరి నుంచి మరొక్కరికి చాలా వేగంగా విస్తరిస్తుంది. ఇన్‌ఫెక్టెడ్ రోగి తుమ్మినప్పుడు గానీ, దగ్గినప్పుడు గానీ ఆ వ్యక్తి నోటి తుంపర్ల నుంచి వచ్చే వైరస్ ఎక్కువ దూరం వ్యాప్తి చెందుతుంది. దీంతో ఒకరి నుంచి మరొకరికి సులభంగా వైరస్ వ్యాప్తి చెందుతుంది. వర్షకాలంలో వాతావరణం తేమగా ఉండటం వల్ల ఈ వైరల్ ఇన్‌ఫెక్షన్లు గాలి ద్వారా ఎక్కువ దూరం వ్యాప్తి చెందే అవకాశం ఉంది. దీంతో ఒక ఇంట్లో వైరల్ జ్వరాలు వచ్చాయంటే వెంట వెంటనే పొరుగిళ్లలోని



వారికి కూడా సోకుతాయి. ఇన్‌ఫ్లుయెంజా ప్రభావం వానాకాలంలో అధికంగా ఉంటుంది. ఈ వైరస్ సోకితే గతంలో మందులు వాడితే రెండు మూడు రోజుల్లోనే ఉపశమనం కలిగేది. కానీ, ఈ వైరస్‌లో వచ్చిన మ్యుటేషన్‌ల కారణంగా మందులు వాడినా మూడు నాలుగు వారాలపాటు లక్షణాలు తగ్గడం లేదు.

**రెండోసారి దాడి..**

వైరస్ ఇన్‌ఫెక్షన్లు వచ్చినప్పుడు రోగిలో ఉన్న ఇమ్యూనిటీ తగ్గిపోయి బ్యాక్టీరియా బారిన పడుతున్నారు. ఈ విధంగా వైరల్ ఇన్‌ఫెక్షన్ల వల్ల రోగనిరోధక శక్తి తగ్గి, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్స్‌కు గురికావడాన్ని సెకండరీ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్స్ అంటారు. దీనివల్ల రోగి ఎక్కువ రోజుల పాటు జలుబు, దగ్గు, నీరసం తదితర సమస్యలకు గురవుతాడు. షుగర్, బీపీ, ఆస్తమా వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై ఈ వైరస్‌లు, సెకండరీ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు తీవ్రంగా ప్రభావం చూపుతాయి. సాధారణ రోగుల కంటే వీరు కొంత ఎక్కువ కాలం వ్యాధికి గురయ్యే అవకాశాలుంటాయి.


**నిర్ధారణ పద్ధతులు**

సాధ్యమైనంత వరకు అనుభవజ్ఞులైన వైద్యులు రోగిలో ఉన్న లక్షణాల ఆధారంగా వ్యాధి లేదా వైరస్‌ను అంచనా వేస్తారు. కచ్చితంగా తెలుసుకోవాలంటే బ్లడ్ కల్చర్ టెస్ట్, యూరిన్ కల్చర్ పరీక్షలు జరిపి వచ్చిన వైరస్‌తో పాటు బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లను కూడా నిర్ధారించవచ్చు.

**అందుబాటులో ఉన్న చికిత్స**

సాధారణంగా వైరల్ ఇన్‌ఫెక్షన్లకు యాంటి బయాటిక్ మందులు వాడనవసరం లేదు. కొన్ని సందర్భాలలో మాత్రమే వీటిని వాడాలి. వైరల్ ఫీవర్ వచ్చిన తర్వాత సెంకడరీ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ బారిన పడే ప్రమాం ఉంది. దీని బారినపడితే వైద్యుల సూచనలతో యాంటి బయాటిక్ మందులను నిర్ణీత మోతాదులో, నిర్దేశిత కాలం వాడాలి. ఎలా పడితే అలా, ఏవి పడితే అవి వాడితే ఆరోగ్యానికి హానికరం. కొన్ని సందర్భాలలో తీవ్రమైన దగ్గు, ఊపిరితిత్తుల్లో గాలి మార్గాలు మూసుకుపోయినప్పుడు తేలికపాటి స్టిరాయిడ్స్ వాడాల్సి వస్తుంది. అంతేకాకుండా దీర్ఘకాలం పాటు తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులతో బాధపడితే పెయిన్ కిల్లర్స్ సైతం తీసుకోవాల్సి వస్తుంది. అయితే ఈ మందులన్నీ అనుభవజ్ఞులైన వైద్యుల సూచన మేరకే వాడాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ సొంతంగా యాంటి బయోటిక్ మందులు వాడకూడదు.

# దత్తుడిమాటే.. మాబాట..



సనాతన ఆధ్యాత్మిక ప్రవాహంలో అవధూత సంప్రదాయం నిరంతర స్రవంతి. ఆ సజీవ జలధారకు పరమశివుడు జన్మస్థలమైతే.. త్రిమూర్తి అంశతో జన్మించిన దత్తాత్రేయుడు సంగమ క్షేత్రం. దత్త సంప్రదాయాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తున్న సిద్ధ పురుషులు అవధూత దత్తపీఠం వ్యవస్థాపకులు గణపతి సచ్చిదానంద స్వామివారు. సమాజం మారాలి. తన ఇల్లూ, ఒళ్లూ దగ్గరికి వచ్చేసరికి అందరూ అప్రమత్తతగా ఉంటారు. జాగ్రత్తగా చూసుకొంటూ ఉంటున్నారు కదా! అలాగే సంఘమనే ఇల్లు మనది అని ప్రతిఒక్కరూ అనుకోవాలి. అప్పుడే రోగాలు రావు. సమస్యలు రావు. దుర్మార్గులు దాడి చెయ్యటానికి అవకాశం ఉండదు. క్రమక్రమంగా 'నాది' అనేది విడిచి 'మనది' అనేది పెంచుకోవాలి. ఆయన పలుకు మధురం. ఆయన గానం అమృతం. కఠోపనిషత్తును కూడా సులభంగా అర్థమయ్యేలా అనుగ్రహిస్తారు. కఠిన పరిస్థితుల్లో ఉన్న భక్తులకు ఔదుంబర వృక్షమై నీడనిస్తారు. అవధూత సంప్రదాయానికి ఆలవాలం స్వామి హృదయం. అంతుబట్టని దత్త తత్త్వానికి భాష్యం వారి వదనం. దత్త మార్గాన్ని ఉపదేశిస్తూ%ొ% సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తూ.. ఆధ్యాత్మిక విలువలను పెంపొందిస్తూ.. స్వామి సేవతోపాటు సమాజ అభ్యున్నతికీ దశాబ్దాలుగా తన తపస్సును ధారపోస్తున్నారు. అవధూత దత్తపీఠం ద్వారా భారతావనిలో మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా దేశదేశాల్లో భారతీయ ఆధ్యాత్మిక గరిమను చాటిచెబుతున్న మహనీయులు స్వామివారు. దేవీ నవరాత్రుల సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌కు విచ్చేసిన గణపతి సచ్చిదానంద స్వామితో 'చింతన' ప్రత్యేక సంభాషణ నమస్కారం స్వామీజీ! సనాతన ధర్మం పరిరక్షణకు అవధూత దత్తపీఠం దశాబ్దాలుగా ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నది! ప్రస్తుతం పీఠం ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న ధార్మిక ప్రచార విశేషాలను మాతో పంచుకోగలరు! సనాతన ధర్మం పరిరక్షణకు అవధూత దత్తపీఠం అహరహం కృషి చేస్తూ వస్తున్నది. ఆ సమయానికి, ఆ సందర్భానికి తగినట్లుగా, దత్తుడు నడిపించినట్లుగా మేము నడుస్తూ ఉంటాం. పీఠంలోనూ, మా పీఠశాఖలలోనూ శాస్త్ర ప్రకారంగా నిరంతరం క్రతువులు జరుగుతూ ఉంటాయి. లోక కల్యాణార్థమై ఆయా కాలాలలో చేయవలసిన పూజలు, హోమాలు, వ్రతాలు విధిగా జరుగుతూ ఉంటాయి. విదేశాల్లోనూ దత్తపీఠం ఎన్నో ఆలయాలను నిర్మించింది! ధార్మిక ప్రచారం నిర్వహిస్తున్నది! గతంతో పోలిస్తే ఇప్పుడు విదేశాల్లో మన ధర్మం పట్ల ఎలాంటి వైఖరి ఉందని గమనించారు? మన హిందూ సంప్రదాయం పట్ల శ్రద్ధ పెరిగింది. మన ధర్మం పట్ల భయం, భక్తి పెరిగాయి. పైకి పాశ్చాత్యపు పోకడలు ప్రదర్శిస్తూ ఉన్నా ఇంటా, బయటా కూడా దేవుడికి దండం పెడుతూనే ఉన్నారు. అందుకే అక్కడ ఉన్న అన్ని ధార్మిక సంస్థలలోని భక్తులు ఆధ్యాత్మికరంగంలో అపూర్వ విజయాలు సాధిస్తున్నారు. ఎవరూ సాధించలేని రికార్డులు నెలకొల్పుతున్నారు. ఆధ్యాత్మిక పురోగతి కనిపిస్తున్నందుకు చాలా సంతోషం. ఆధ్యాత్మిక సేవతోపాటు సామాజిక సేవలకూ దత్తపీఠం కృషి చేస్తున్నది. సేవాపథంలో మీరు అమలు చేస్తున్న ప్రణాళికల వివరాలు.. మాది దత్త సంప్రదాయం. దత్తుడు చెప్పినట్టుగా మేము నడుస్తూ ఉంటాం. దత్తుడు 'ఈ సత్కార్యాన్ని ఇప్పుడు చెయ్యి' అని ఆజ్ఞాపిస్తాడు. వెంటనే దానిని మేము ఆచరిస్తాం. అంతేకానీ ముందుగా నిర్ణయించి పెట్టుకొని అమలు చేయడం, అనుకూలంగా లేకపోవటంతో అమలు చేయకపోడం అనేవి ఉండవు. పీఠ పర్యవేక్షణలో అన్నదానం, విద్యాదానం, వృద్ధుల కోసం 'అమ్మ ఒడి', 'వాగ్దేవి' పేరుతో మూగ, చెవుడు సమస్యలు ఉన్న పిల్లలకు తగిన పాఠశాల, ఇంకా వృద్ధాశ్రమాలు, గోసేవ వంటి సేవలు కొనసాగుతున్నాయి. ఆధ్యాత్మికతను, అధునాతన విజ్ఞానాన్ని ఎలా సమన్వయం చేసి చూడాలి? అసలు ఈ సమన్వయం అనేది సమంజసమైనదేనా? సమంజసమైనదే! ఈనాటి భౌతికశాస్త్రం అణుఖండాల చలనాన్ని గురించి పరిశీలించి, పరిశోధించి నోబెల్ బహుమతులు సాధించి.. చివరికి మన సిద్ధాంతంలోకే చేరుతున్నది. ఇది మన కంటికి కనిపిస్తూనే ఉంది. సంతోషం. నిన్నటి దాకా జడమనుకొన్నది ఇవాళ విజ్ఞానశాస్త్రం ప్రకారంగా కూడా చేతనమే అవుతున్నది. ఉపనిషత్తులలో 'సర్వం ఖల్విదం బ్రహ్మ' ఈ ప్రపంచమంతా బ్రహ్మపదార్థమే అని పేర్కొని ఉంది. అంటే చైతన్యమే అని నిశ్చయంగా ఘోషించింది. పూర్వం కార్తవీర్యుడు ద్వైతంలో కొట్టుమిట్టాడుతూ ఉండేవాడు. సందేహాలతో సతమతమవుతూ ఉండేవాడు. ఒకనాడు అతను దత్తస్వామిని ఆశ్రయిస్తే ఆయన యోగోపదేశం చేసి శక్తి పాతం చేశాడు. అప్పుడు అతను ఈ శాస్త్రవేత్తల లాగా సాధన చేసి, సత్యాన్ని తెలుసుకొన్నాడు. ఆ సందర్భంలో 'దేశే కాలే పదార్థే వా చిదాత్మకో విభాతి మే చిదానందో మహోత్శేశ పదార్థాలన్యోన విద్యతే?' అని కార్తవీర్యుడు పేర్కొన్నాడు. అంటే, 'నాకంతా చిదానందమే కనిపిస్తున్నది. ప్రతివస్తువులోనూ చిదానందమే గోచరమవుతున్నది. చైతన్యం కంటే వేరే వస్తువు లేనే లేదు' అని చెప్పాడు. ఇలా అధ్యాత్మికతతో విజ్ఞానాన్ని సమన్వయం చేసుకొని చూస్తే సత్ఫలాలు దక్కి లోకానికి మేలు కలు గుతుంది. సమన్వయం లేకుండా సాధన చేస్తే దుష్ఫలాలు సంభవించి కీడు జరుగుతుంది. ఇటీవల కొన్ని పుణ్యక్షేత్రాలలో జరిగిన సంఘటనలను ఉదహరిస్తూ, ఇలా జరుగుతుంటే మీ దేవుడు ఏం చేస్తున్నాడంటూ కొంతమంది విపరీత వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ అంశాన్ని ఎలా చూడాలి? ఇటువంటి సందర్భాల్లో భగవంతుడు ఎందుకు నిదర్శనాలు చూపడం లేదు? దేవుడు ఎంతో దయగలవాడు. భూమాత లాగా ఎంత క్షమిస్తాడో ప్రళయం వచ్చినప్పుడు అంతగా కంపించి కోపిస్తాడు. మేడ కట్టటానికి (మంచికి) చాలా కష్టపడాలి కానీ, కూల్చటానికి (కీడుకు) ఎంత సేపు? తప్పు చేయగానే వెంటనే శిక్ష పడిపోవాలి అనేది మన సిద్ధాంతం కాదు. మన ధర్మం అసలే కాదు. పగవాడికి కూడా అన్నం పెట్టి పంపిస్తుంది మన ధర్మం. వాడు మంచి వాడిగా మారటానికి చాలా అవకాశాలు ఇస్తుంది. ఇక పాపం పండినప్పుడు, ఒక్కసారిగా ఉప్పెన వచ్చి పూర్తిగా తుడిచిపెట్టినట్లుగా, దేవుడు కలియుగంలోని దుష్టుల అంతు చూస్తాడు. అయితే దుష్టులు అవహేళన చేస్తున్నారని సత్కార్యాలు ఆపకూడదు. చీమలు కలిసి ఉంటే ఏనుగును బంధించేస్తాయి. అలాగే కలిసికట్టుగా ఉంటే దుష్టులేమీ చెయ్యలేరు. విడిగా ఉంటేనే వారికి అవకాశం దొరుకుతుంది. ఎప్పటికప్పుడు ఇలాంటి ప్రశ్నలే తలెత్తుతూ ఉంటాయి. ప్రయత్నం చేయకుండా, దేవుడేమీ చేయడం లేదు, నిదర్శనాలు చూపటం లేదనడం ఎంతవరకు సబబు? సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు%ొ% ఇవన్నీ ఇప్పటి తరం నుంచి దాదాపుగా దూరమైంది. ఇలాగైతే, కొంతకాలానికి మన సంస్కృతి పూర్తిగా మారిపోయే ప్రమాదం ఉంది కదా! ఇలాంటి పరిస్థితుల్లో ఒక కుటుంబం ఎలాంటి ఆధ్యాత్మిక విధానాన్ని అనుసరించాలి? మన గీతను మార్చే గీతాచార్యుడు చెప్పిన గీతలోని మాటే అందరికీ శిరోధార్యం. 'తస్మాచ్ఛాస్త్రం ప్రమాణంతే' అంటే శాస్త్రమే మనకు ప్రమాణం. శాస్త్రం చెప్పినట్లుగా ఆచరిస్తే మన ఆధ్యాత్మికతకు ఎలాంటి లోటు రాదు. మన జీవనశైలి అస్తవ్యస్తం కాదు. 'చక్కగా చేతులు కాళ్లు, కడుక్కోవాలి' అని మన శాస్త్రం ఆనాడే చెప్పింది. కానీ మనం 'ఆc పాటించకపోతే ఏమౌతుంది లే' అని మరిచిపోతే కరోనా వచ్చి గుర్తు చేసి, లోకానికే శుచి, శుభ్రత నేర్పింది. ఇంకా ఎన్నో పాఠాలు నేర్పింది. కాబట్టి మన శాస్త్రం చెప్పింది చెప్పినట్లుగా చేస్తే మన సంస్కృతి బాగుంటుంది. సంప్రదాయాలు బాగుంటాయి. ఆచారాలు బాగుంటాయి. కుటుంబం బాగుంటుంది. దైవం మంత్రాధీనం అనీ, మంత్రం శబ్దం, స్వర ప్రధానమని అంటారు. అయితే, ఆధునిక విద్యకు అలవాటుపడిన నేటి తరం అలాంటి కష్టతరమైన మంత్రాలు పఠించే, స్తోత్రపాఠాలు చేసే అవకాశం ఉండదు! స్వరయుక్తంగా మంత్రపఠనం చేయలేని వాళ్లు ఆధ్యాత్మిక సాధనలో ఎలాంటి మార్గాన్ని అనుసరించాలి! పూర్వం మరా అనే పదాన్ని పలికి మహర్షి అయిన మహనీయుడు ఉన్నాడు కదా! అందుచేత నామస్మరణ మార్గాన్ని అనుసరిస్తే మంచిది. దక్షిణాదిన, ఉత్తరాదిన గల దాసులు, సంతులు, సత్పురుషులు అందరూ కూడా నామసంకీర్తన మార్గాన్నే అనుసరించి తరించారు. మా మార్గం కూడా ఇదే! ఇదే అన్నిటికీ పునాది. మంత్రోపాసనకు ఇదే మొదటి మెట్టు. భగవన్నామస్మరణ చేస్తే ఏకాగ్రత, జ్ఞాపకశక్తీ రెండూ పెరుగుతాయి. వయస్సు కూడా సహకరిస్తుంది. స్వధర్మమే అన్ని విధాలా శ్రేష్ఠమని గీతాచార్యుని ఉవాచ. అయితే ఆధునిక జీవనంలో ఒక మనిషి తన స్వధర్మాన్ని ఎలా గుర్తించాలి? తన చక్కని ప్రవర్తన వల్ల ఇతరులు కూడా తనలాగానే జీవించాలి. తన లాగానే ఇతరులు కూడా సంతోషంగా ఉంటూ అభివృద్ధి చెందటానికి వీలు కల్పించాలి. దేవతలను తృప్తి పరుస్తూ, దేవతల వల్ల తాను కూడా సంతృప్తి పొందుతూ ఉండాలి. ఇటువంటి ప్రవర్తననే తన స్వధర్మమని మనిషి గుర్తించాలి. 'తపస్సు, శౌచం, దయ, సత్యం' అనే వాటిని పట్టుకొని ధర్మాన్ని అనుసరించాలి. తపస్సుతో గర్వం తొలగిపోతుంది. శుచిగా ఉండటంతో దుస్సాంగత్యం తప్పుతుంది. దయ కలిగి ఉండటంతో మదం తగ్గుతుంది. సత్యంగా ఉండటంతో అసత్యం తొలగిపోతుంది. మంత్రోపదేశ గురువు లక్షణాలు ఎలా ఉండాలి? ఆయన అనుగ్రహం పొందాలంటే భక్తుడు పాటించాల్సిన నియమాలేంటి? గురువు సాధన దశను దాటి మంత్రసిద్ధుడు, యోగసిద్ధుడై ఉండాలి. అటువంటి గురువు అనుగ్రహం పొందటానికి భక్తుడు దృఢమైన నియమనిష్ఠలు కలిగి ఉండాలి. శుచి శుభ్రతలు పాటించాలి. భక్తిశ్రద్ధలు కలిగి ఉండాలి. గురు ముఖతః మంత్రోపదేశం పొందే అదృష్టం అందరికీ దక్కకపోవచ్చు. అలాంటి వ్యక్తులు ఏదైనా మంత్రం సాధన చేయాలంటే ఏ పద్ధతిని పాటించాలి?

'భజగోవిందం భజగోవిందం' భగవన్నామాన్ని జపించాలి.

సాధకులకు సైతం మనసు స్థిమితంగా ఉండదు కదా! మంత్రం జపం చేస్తున్నా, మరేదైనా పారాయణం చేస్తున్నా మనసు పరిపరివిధాల ఆలోచనల్లోకి వెళ్లిపోతుంటుంది కదా! అలా మనసును కట్టడి చేయలేనప్పుడు ఆ మంత్రానుష్ఠాన ఫలితం దక్కకుండా పోతుందా? ఎందుకు దక్కదు. ఫలితం దక్కుతుంది. ఈ పరిస్థితి గొప్ప గొప్ప మహర్షులకే సంభవించి, వారి మనస్సు జారిపోయింది. అప్పుడు వారు ఆ సమయాలలో ఏం చేశారు? కిందకి జారిపోయారా? లేదు. మళ్లీ ప్రయత్నించి సాధన చేశారు. తపస్సిద్ధిని పొందారు. అందుచేత మహర్షుల లాగా విడవక ప్రయత్నిస్తూ ఉండటమే అందుకు తగిన ఉపాయం. గంగలో మునకేయడం ద్వారా పాపాలు పోతాయనీ, కార్తిక మాసంలో దీపారాధన చేస్తే దోషాలు తొలగిపోతాయనీ చాలామంది చెబుతున్నారు! చాలామంది గంగలో మునకేసి.. తమ పాపాలన్నీ కడిగేసుకోవచ్చు అనే భావనకు వస్తున్నారు! శాస్త్రం సూచించిన ఇలాంటి పరిహారాల్లో అంతరార్థం తెలియజేయండి? సందేహస్పర్శ ఉండకూడదు. ఉంటే ఫలితం దక్కదు. కనుక సందేహం లేకుండా భక్తి విశ్వాసాలతో గంగాస్నానం చేస్తే పాపాలు పోతాయి. ఆ పాపాలను గంగామాత తీసుకొంటుంది. ఇది సత్యం. ఇందుకు ఎన్నో పురాణగాథలు నిదర్శనాలుగా ఉన్నాయి. కనుక శాస్త్రం 'చిత్తశుద్ధే ప్రధానమ'ని ఘోషించింది. అన్ని ధర్మాలను పరిత్యజించి తననే శరణు వేడమని శ్రీకృష్ణ పరమాత్మ గీతలో ఉద్బోధించారు. అయితే, అన్ని ధర్మాలను త్యజించడం అంటే ఏమిటి? దీనిని ఎలా అర్థం చేసుకోవాలో తెలుపగలరు? ఇది గీతాచార్యుడు చేసిన బోధ కదా! అందుచేత ఆచార్యుడు మొదటగా ఏ మాటలు బోధించిన తరువాత ఈ మాట బోధించాడు అనేది గుర్తు పెట్టుకోవాలి. కానీ, ఈ చివరి మాటొక్కటే పట్టుకొని పాటిస్తే అధోగతి పాలు కావటం జరుగుతుంది. 'సర్వధర్మాన్' అన్న చోట ధర్మాధర్మాలను రెంటినీ కూడా స్వీకరించాలి అనే విషయం జ్ఞాపకం ఉంచుకోవాలి. ఆచార్యుడు మొదటగా కర్మ చెయ్యమన్నాడు. తరువాత ఆయన రెండోసారి ఫలాన్ని విడిచి పురుషార్థంపై ఆధారపడి కర్మ చెయ్యమన్నాడు. ఆ తరువాత మూడోసారి ఆ పురుషార్థాన్ని కూడా విడిచిపెట్టి నన్ను శరణు పొందు అన్నాడు. నేననే భేదభావం లేని ఏకస్వరూప పరమాత్మను శరణుపొందు అన్నాడు. ఇదీ అన్ని ధర్మాలను విడిచిపెట్టు అన్న మాటకు అర్థం. ఈ సోపానాలు పట్టించుకోకుండా చివరిది మాత్రమే పాటిస్తాను అంటే పతనం కావటం జరుగుతుంది. దీనిని ఇలాగే చక్కగా అర్థం చేసుకోవాలి. ఉద్యోగం, వ్యాపారం ఇలా దైనందిన జీవితంలో చిక్కుకుపోయిన మనిషి నిషిద్ధ ఆహార విహారాదులకు పాల్పడుతూ ఉన్నాడు! ఇలాంటి వ్యక్తులు మన పెద్దలు సూచించిన సనాతన జీవన విధానాన్ని ఎలా అనుసరించాలి? వారికి ప్రత్యామ్నాయం ఏమిటి? ముఖ ప్రక్షాళనము, శరీరాన్ని పరిశుభ్రం చేసుకోవటం అనేవి కూడా దైనందిన జీవితమే కదా! మరి ఇదీ తప్పనిదే గా! మరి ఇక్కడ నియమమెందుకు? అక్కడ నియమభంగం ఎందుకు? ఈ రెండిటికీ మధ్య గల అడ్డం ఏమిటి? అంటే లాభం. లాభం కోసం (స్వార్థం కోసం) దిగజారితే వ్యక్తిత్వమే దిగజారిపోతుంది. లేకపోతే గొప్పగా ఉంటుంది.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com